క్లుప్తంగా

46 మద్యం బాటిళ్లు స్వాధీనం


ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

చింతపల్లి: మండలంలో అక్రమంగా తరలిస్తున్న 46 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ కూర్మారావు తెలిపారు. లంబసింగి జంక్షన్‌లో సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమతి లేకుండా తరలిస్తున్న అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ కూర్మారావు చెప్పారు. ఎస్ఐ సోమయ్య,హెడ్ కానిస్టేబుల్ కుమార్ తదితరులున్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ సభ


డాక్టర్ చిన్నబాబు

గంగవరం: రాజవొమ్మంగిలో ఎమ్మార్పీఎస్ సభ మంగళవారం నిర్వహించనున్నట్టు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు డాక్టర్ నిడమర్తి చినబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉత్తర కోస్తా ఆంధ్ర జిల్లాల ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి , కన్వీనర్ ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ పాల్గొంటారని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ముమ్మరంగా వరికోతలు


వరికోత పనుల్లో గిరిరైతులు

గూడెంకొత్తవీధి: వాతావరణం అనుకూలించడంతో గూడెంకొత్తవీధి మండలంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు కొద్దిరోజులుగా వరికోతల పనుల్లో నిమగ్నమయ్యారు. వాతావరణం చూసుకుని రైతులు కోతలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు తెలిపారు. అద్దరవీధి గ్రామంలో పంటకోత ప్రయోగాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలిచ్చారు.

విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలి


జడుమూరు పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ-2 రామన్న

గూడెంకొత్తవీధి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని గూడెంకొత్తవీధి ఎంఈఓ-2 రామన్న అన్నారు. మండలంలోని జడుమూరు జీపీఎస్ పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను, బోధన విషయాలపై ఆరా తీశారు. విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సీలేరు: జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. అనంతరం ''విద్య–ఆవశ్యకత '' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్న ఆయన తెలిపారు.

సిరులు కురిపిస్తున్న అటవీ ఉత్పత్తులు


హుకుంపేట సంతలో అడ్డాకులు విక్రయిస్తున్న గిరిజనులు


ముంచంగిపుట్టు వారపు సంతకు తీసుకు వచ్చిన వెదురు వస్తువులు

- ఆశాజనకంగా ధరలు
- ఆనందంలో గిరిజన రైతులు


వారపు సంతలో విక్రయించేందుకు ఆటోపై తరలిస్తున్న అడ్డాకులు

హుకుంపేట: గిరిజన ప్రాంతంలో విరివిగా లభ్యమైన అటవీ ఉత్పత్తులకు సంతల్లో గిరాకీ నెలకొంది. ప్రస్తుతం ధరలు బాగుండడంతో అటవీ ఉత్పత్తులు సిరులు కురిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని వారపు సంతకు మారుమూల గ్రామాలైన చీకుమద్దుల, జర్రకొండ, గన్నేరుపుట్టు తదితర పంచాయతీలతో పాటు డుంబ్రిగుడ మండలం జర్రాయి, లాసేరు, దాతురు గ్రామల నుంచి గిరిజనులు సంతలకు వస్తుంటారు. ప్రస్తుతం అడ్డాకుల వ్యాపారం జోరుగా సాగుతోంది. అడ్డాకుల కట్టల కావిడి రూ. 1400 నుంచి రూ.1800 వరకు ధరలు పలకడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో అడ్డాకులకు గిరాకీ నెలకొంది. విశాఖపట్నం, పెందుర్తి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి అడ్డాకులను ఎక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే దళారుల బెడద రైతులను వేధిస్తోంది. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి కుమ్మక్కై గిరిజనుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు మైదాన ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని పలువురు చెబుతున్నారు. అధికారులు జీసీసీ ద్వారా కొనుగోలు చేస్తే తమకెంతోమేలు జరుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

వెదురు వస్తువులకు గిరాకీ

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండలంలో జరిగే వారపు సంతల్లో వెదురు వస్తువులకు మంచి గిరాకీ ఏర్పడింది.గిరిజన రైతులు గ్రామాల్లో వ్యవసాయ కోతలు, నూర్పులు అనంతరం పంటలైన ధాన్యం, సాములు, రాగులు, అలిసెలను నిల్వ చేసుకునేందుకు వెదురుతో తయారుచేసిన వస్తువులనే వినియోగిస్తారు. వీటిని కొనుగోలు చేయాలంటే వారపు సంతలోనే లభ్యమవుతాయి. దీంతో ముంచంగిపుట్టు, జోలాపుట్టు, లక్ష్మీపురం, బంగారుమెట్ట,భూసిపుట్టు వారపు సంతల్లో వీటిని ఎక్కువగా అమ్ముతున్నారు. అధిక సంఖ్యల్లో గిరిజన రైతులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వెదురు బుట్టలు, చాపలు, చేటలుకు మంచి గిరాకీ నెలకొంది.బుట్ట ఒక్కటి రూ.400 నుంచి రూ.500 వరకు ధర పలకగా, చాపలు రూ.200 నుంచి రూ.300, చేటలు రూ.120 నుంచి రూ.150 వరకు ధరల వరకు అమ్మకాలు సాగాయి. ధరలతో సంబంధం లేకుండా గిరిజన రైతులు వెదురు వస్తువులను కొనుగోలు చేస్తూ గ్రామాలకు మోసుకొని ,ఆటోల్లో, జీపుల్లో తీసుకొని వెళ్తున్నారు.


సంత నుంచి బుట్టలు కొనుగోలు చేసుకొని ఆటోలో తీసుకెళ్తున్న దృశ్యం

జీసీసీ కొనుగోలు చేయాలి



అడ్డాకులపైనే ఆధాపడి మేమంతా బతుకుతున్నాం .వారపు సంతల్లో అడ్డాకుల ధరలు అధికంగా ఉండడం సంతోషంగా ఉంది. ధరలు నిత్యం ఇలానే ఉండేలా ప్రభుత్వం చూడాలి. దళారీల బెడద నుంచి మోసపోకుండా అధికారులు జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తుల కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– కొర్ర బందబాగ్ ,రాతులపుట్టు గ్రామం,హుకుంపేట మండలం

వైస్ ఎంపీపీ చొరవతో కల్వర్టుకు మరమ్మతు

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ తార్లగూడ గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు దేవ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వారు తమ సొంత నిధులతో సోమవారం పొక్లెయిన్ ఏర్పాటు చేయించి, కోతకు గురైన కల్వర్టును మట్టితో పూడ్చి , మరమ్మతు పనులు చేయించారు. దీంతో తార్లగూడ గ్రామానికి రాకపోకల ఇబ్బందులు తొలగాయి. కల్వర్టు పాడవడంతో రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు, గ్రామాల్లో గృహ నిర్మాణ పనులకు రేకులు, సిమెంట్ తదితర సామగ్రి తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారమని వైస్ ఎంపీపీ చొరవతో సమస్య పరిష్కారమైందని, ఆయా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అధికారులు నూతన స్పందించి కల్వర్టుకు నిధులు మంజూరు చేస్తే, శాశ్వత పరిష్కారం లభిస్తుందని తార్లగూడ గ్రామస్తులు చెబుతున్నారు.


తార్లగూడ వద్ద కల్వర్టుకు మరమ్మతు పనులు

ఆత్మీయ సత్కారం


డాక్టర్ శశికాంత్‌ను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌భాషా, ఎస్ఐ షణ్ముఖరావు, సిబ్బంది

జి.మాడుగుల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ టి.శశికాంత్ మెరుగైన వైద్య సేవలు అందించి మంచిపేరు తెచ్చుకున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా తెలిపారు. మండల స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేసి విశాఖపట్నంలోని సీఆర్‌పీఎఫ్ క్యాంప్(మధువాడ) నకు బదిలీపై వెళ్తున్న డాక్టర్ శశికాంత్‌కు స్థానిక సిబ్బంది ఆత్మీయ సన్మాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన డీఎంహెచ్‌వో జమాల్ బాషా, ఎస్ఐ షణ్ముఖరావు, వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది డాక్టర్ శశికాంత్‌కు శాలువా కప్పి బొకేలు అందించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో జమాల్‌బాషా మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు, పదవీ విరమణలు సాధారణమేనని, సంతృప్తికరమైన సేవలు అందిస్తే మంచి గుర్తింపు పేరు వస్తాయన్నారు. మండలంలో పలు ప్రాంతాల్లోను, విద్యాలయాల్లోను వైద్య శిబిరాలను ఏర్పాటు, పీహెచ్‌సీకి వచ్చే రోగులకు డాక్టర్ శశికాంత్ మెరుగైన వైద్య సేవలు అందించారని కొనియాడారు. ఎస్ఐ షణ్ముఖరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవిచంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఈవో ఎస్ ప్రకాష్‌రావు, హెచ్‌వీలు బి.రత్నం , ఈశ్వరమ్మ, మేనక, వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు


మత్యగుండం మత్యలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఆర్వీనగర్‌లోని శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

హుకుంపేట: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా జిల్లాలోని శైవ క్షేత్రాలు భక్తులతో కళకళలాడాయి. ఈ సందర్భంగా శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తెల్లవారుజామున పుణ్యస్నానాలాచరించిన భక్తులు ఆలయాలకు తరలివచ్చి భోళా శంకరుడిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు. హుకుంపేట మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మత్యగుండంతో పాటు పలు శివాలయాల్లో సోమవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మత్యగుండం మత్యలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. ఉక్కుర్బ, అడ్డుమండ, గంట్రాయిపుట్టు శివాలయల్లో కూడా భక్తులు పూజలు నిర్వహించారు.

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి, ఆర్వీనగర్ శివాలయాల్లో భక్తులు వేకువజామునే ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

చింతపల్లి; మండలంలో గల శివాలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతర్ల శివాలయంతో పాటు మడిగుంట, వంగసార, లోతుగడ్డ, రాజుపాకలులో గల ఆలయాల్లో తెల్లవారు నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.


అంతర్ల శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సీలేరు: దారకొండ గ్రామంలో శివాలయంలో భక్తులు వేకువ జామునే కార్తీక స్నానాలు ఆచరించి మహా శివుని దర్శించుకున్నారు.అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. సుహాసిని, తోకరాయి ఫారెస్టు అధికారి వివేకానందరావు తదితరులు పాల్గొన్నారు. సీలేరు నదిలో కార్తీక స్నానాలు ఆచరించి నదిలో దీపారాధన చేసి స్థానిక శివాలయం వద్ద మహా శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.


దారకొండ శివాలయంలో దీపారధన చేస్తున్న భక్తులు

జీపీడీవోలపై నేటి నుంచి అవగాహన సదస్సులు

కొయ్యూరు: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీవో)లపై మంగళ, బుధవారాల్లో పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, అధికారులకు, బుధవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించనున్నారు.. పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఈవోఆర్‌డీలు ద్వారా అవగాహన కల్పించనున్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడు బాలకృష్ణ


కార్యదర్శి రాజారావు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సోమవారం నిర్వహించిన ఈకార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శిగా శెట్టి బాలకృష్ణ, కె.రాజారావులను మండల కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.చిట్టిబాబు కార్యదర్శి వి.మహేశ్వరరావు సమక్షంలో ఈ ఎన్నికలు జరిగాయి. నూతన అధ్యక్ష, కార్యదర్శలు మాట్లాడుతూ యూటీఎఫ్ లక్షకు పైగా సభ్యతాలు కలిగిన ఏకైక ఉపాధ్యాయ సంఘం అని అల్లూరి జిల్లాలో బలమైన సంఘంగా ఉందన్నారు. మండల ఉపాధ్యాయుల సమస్యల కోసం న్యాయపోరాటం చేస్తూ చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. హుస్సేన్, మోహన్, రామకృష్ణ, మల్లేశ్వరి, దుక్కు, ప్రసాద్ పద్మనాభం, మహిళ విభాగ కార్యదర్శి భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇబ్బందులు

మారేడుమిల్లి : పర్యాటకులు తీసుకువచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, చావడికోట సర్పంచ్ సాదల ప్రేమ్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశమైన గుడిసె హిల్ టాప్ ప్రదేశాన్ని గతంలో అధికారులు పర్యాటకుల సందర్శనను తాత్కాలికంగా నిలిపివేశారని చెప్పారు. అయితే పర్యాటకులు చావడికోట పంచాయతీ పరిధిలోని ఆకుమామిడికోట సంతమార్కెట్, ఉప్పరిగోతులు, చావడికోట ప్రాంతాలకు వచ్చి టెంట్లు వేసి రాత్రిళ్లు బస చేస్తున్నారన్నారన్నారు. వారు తీసుకువచ్చే పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ బాటిళ్లు తదితర వ్యర్థాలను ఆయా విచ్చలవిడిగా వదిలేస్తున్నారని, దీనివల్ల గ్రామాలు అధ్వానంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై తమ గ్రామ పరిధిలో అనుమతి లేకుండా వాహనదారులు పర్యాటకులను తీసుకువచ్చి క్యాంపింగ్ టెంట్లు వేసి ఇక్కడ పరిసరాలను పాడు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ప్రేమకుమార్ హెచ్చరించారు.

పెరిగిన చలితో సతమతం

హుకుంపేట: గిరిజన గ్రామల్లో చలి తీవ్రత పెరిగింది. ఉదయం 10 గంటల వరకు పొగమంచుతో పాటు చలి ఉంటుంది. పొగమంచుతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు.

వాతావరణంలో ఒక్కసారిగా మార్పురావడంతో గత కొద్ది రోజులుగా జిల్లా అంతటా చలిపులి పంజా విసురుతోంది. సాయంత్రం 4 గంటల నుంచి చలిగాలలు వీస్తుండడంతో గిరిజనులు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. చలిలో బయట తిరగొద్దని , ఆరోగ్యంగా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిసున్నారు.

వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు




వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పాడేరు, అరకు ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ఏజెన్సీలో పలు అంశాలపై చర్చించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


చింతపల్లి ఏరియా ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు


కొయ్యూరులో లబ్ధిదారులకు రేషన్ అందజేస్తున్న సీడీపీవో

చింతపల్లి: ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ ఎంఏ) కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ డాక్టర్ అనూష ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్ తదితర పరీక్షలు చేశారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు ఆస్పత్రిలో ప్రతి నెల 9,10 తేదీల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నెల 9వ తేదీ ఆదివారం సెలవు కావడంతో సోమ, మంగళవారాలు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు సిబ్బంది తెలిపారు. ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన శిబిరంలో 46 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు జరిపి మందులను పంపిణీ చేశారు.

కొయ్యూరు: బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో విజయకుమారి సూచించారు. పెదమాకవరం, గాదేగుమ్మి, చుట్టుబంద అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సోమవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు తీసకోవడం ద్వారా చాలా వరకు రక్తహీనత నివారించవచ్చన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలోను కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేయాలని వర్కర్లను ఆదేశించారు. సూపర్‌వైజర్ మహాలక్ష్మి మంపపంచాయతీలో మారుమూల ప్రాంతంలో ఉన్న పి.గంగవరం, టీటోరాల్ల గ్రామాలను సందర్శించారు. అక్కడ మహిళలకు ఆరోగ్య భద్రతపై సూచనలు చేశారు. రక్తహీనత నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు.

ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన


ముంచంగిపుట్టులో అవగాహన కల్పిస్తున్న ఏపీఎం కళావతి


రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

ముంచంగిపుట్టు: అందరికీ విద్య అందించడమే ఉల్లాస్ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని ఏపీఎం సీహెచ్.కళావతి అన్నారు.మండల కేంద్రంలో సోమవారం ఉల్లాస్ కార్యక్రమంపై ప్రత్యేకంగా నియమించిన వలంటీర్లకు అవగాహనతో పాటు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఏపీఎం కళావతి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణలపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. నిరక్షరాస్యులను అక్షరాసులుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని వినియోగంలోకి తీసుకొచ్చిందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వీవోఏలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకే ఉల్లాస్ కార్యక్రమాన్ని కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు అన్నారు. వెలుగు వీఓఏలు, వలంటీర్లకు సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఉల్లాస్ పథకం విజయవంతమయ్యేందుకు విద్యాశాఖ, వెలుగు, స్త్రీశిశు సంక్షేమ సంస్థలు సమన్వయంతో పని చేయాలని కోరారు. ప్రజల్లో ప్రాథమిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్యసంరక్షణ, అవగాహన, కుటుంబసంక్షేమం, జీవన నైపుణ్యాలను పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నదే ఉల్లాస్ ప్రధాన లక్ష్యం అన్నారు. గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు బాలమ్మ, ఎంఈఓ, ఏపీఓ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ


నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని అందజేస్తున్న ఎంఈవో బాబూరావు పడాల్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

జి.మాడుగుల: విద్యార్థులు లక్ష్యసాధనపై దృష్టి సారించి తదనుగుణంగా చదవాలని ఎంఈవో చిట్టపులి బాబూరావు పడాల్, యువసేన హెల్పింగ్ హాండ్స్(విశాఖపట్నం) ప్రతినిధి నవీన్ తెలిపారు. మండలంలోని బూసిపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నం యువసేన హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు కంచాలు, నోట్‌బుక్స్, పెన్సిళ్లు, స్కేల్స్, రైటింగ్ ప్యాడ్స్, పెన్సిళ్లు , స్టేషనరీ పౌచ్‌లు, జామెట్రీ బాక్సులు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు తదితర వస్తువులను అందజేశారు. మర్రిపాలెం పాఠశాలలో విద్యార్థులకు కూడా ఆయా వస్తులను పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థ సేవలను సద్వినియోగం చేసుకొని విద్యాభివృద్ధి సాధించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీను, చిరంజీవి, దివ్య, అనిత, భవానీలకు ఎంఈవో బాబూరావుపడాల్ అభినందనలు తెలియజేశారు.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్


ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స


గూడెంకొత్తవీధిలో ర్యాలీ చేస్తున్న గిరిజన సంఘం నాయకులు, నిరుద్యోగులు

ముంచంగిపుట్టు: ఆదివాసీ యువత కోసం ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాంచిపెంట అప్పలనర్స డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ మండల మహాసభను సోమవారం నిర్వహించారు. ప్రజా సమస్యలపై భవిష్యత్తులో చేయాల్సిన పోరాటలపై చర్చించి, కార్యచరణను రూపొందించారు.అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి, జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలని, ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ ఆదివాసీ యువత కోసం ప్రభుత్వం ప్రత్యేక డీఎస్సీ వెంటనే ప్రకటించాలని, జీవో నెంబర్ 3ను అమలు చేయాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఉపాధి హామీ పనిదినాలు 200 రోజుల నుంచి 600లకు పెంచాలని, గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారించాలని ఆయన డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, నేతలు త్రినాథ్, శ్రీను, భీమరాజు, రాందాసు, నారాయణ, జీనమంధు, నర్సయ్య, శంకర్‌రావు తదితరలు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: అసెంబ్లీ సమావేశాల్లో జీవో నంబరు 3 పునరుద్ధరణపై ప్రత్యేక తీర్మానం చేసి చట్టబద్ధత కల్పించాలని గిరిజన సంఘం గూడెంకొత్తవీధి మండల అధ్యక్షుడు ముర్లచంటిబాబు అన్నారు.జీవో నంబరు 3 పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలకేంద్రంలో నిరుద్యోగులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు, టీడీపీ నాయకుడు ముక్కలి మహేష్, మన్య పుత్ర యువజన సంఘం అధ్యక్షుడు సోమేష్ కుమార్, రాజు వైఎస్సార్‌సీపీ నాయకులు బాబి, పరమేష్ రామారావు, వైస్ సర్పంచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.